క్లుప్తంగా

రేషన్ డీలర్లు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ మునివేలు

బొమ్మనహాళ్: చౌక డిపో డీలర్లు ప్రజలకు అందుబాటులో ఉండి, రేషన్ సక్రమంగా అందించాలని తహసీల్దార్ మునివేలు ఆదేశించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో చౌక దుకాణాల నిర్వాహకులు ఎండీయూ వాహనదారులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మునివేలు మాట్లాడుతూ ప్రతి నెల 1 నుంచి 18 వరకు ఎండీయూ వాహన నిర్వాహకులు తమకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఇష్టం లేనివారు తమకు కేటాయించిన వాహనాలను తమకు అప్పగించి, తప్పుకోవాలన్నారు. డీలర్లు కందిపప్పు కేజీ రూ.67కు, చక్కెర అర కేజీ రూ. 17 చొప్పున విక్రయించాలన్నారు. కార్యక్రమంలో డీటీ శ్యామ్, డీలర్ల సంఘం అధ్యక్షులు పయ్యావుల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ హ్యాండ్‌బాల్ జట్టుకు రాజు ఎంపిక



ఎంపికైన రాజు

కంబదూరు: జాతీయ ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) హ్యాండ్‌బాల్ పోటీలకు మండల గ్రామానికి చెందిన రాజు ఎంపికయ్యాడు. ఉత్తరాఖండ్‌లో ఈనెల 27 నుంచి నిర్వహించనున్న 38వ నేషనల్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హ్యాండ్‌బాల్ పోటీల్లో ఏపీ జట్టు తరఫున రాజు ప్రాతినిధ్యం వహించనున్నాడు. రాజు ప్రస్తుతం అనంతపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సర్పంచ్ పద్మావతమ్మ, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా కార్యదర్శి సాకే గంగాధర్ తదితరులు రాజును అభినందించారు.

మోపిడిలో పోలీసుల నాకాబందీ



మోపిడిలో నాకాబందీలో భాగంగా సోదాలు చేస్తున్న ఎస్‌ఐ, సిబ్బంది

ఉరవకొండ: మండలంలోని మోపిడి గ్రామంలో ఎస్‌ఐ జనార్దన్‌నాయుడు, సిబ్బంది శనివారం నాకాబందీ నిర్వహించారు. అనుమానిత ఇండ్లు, స్థలాలను ఎస్‌ఐ సోదాలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో ఎస్‌ఐ జనార్దన్‌నాయుడు సమావేశమై మాట్లాడారు. గ్రామంలో ఎలాంటి ఘర్షణలు, అల్లర్లకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రహదారిపై వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలు



అర్ధరాత్రి హోల్‌సేల్ వ్యాపారులను అడ్డుకుని హెచ్చరిస్తున్న అధికారులు

రాయదుర్గంటౌన్: పట్టణ నడిబొడ్డున వినాయక సర్కిల్ నుంచి గాంధీ సర్కిల్ వరకు ప్రధాన రహదారిపై వ్యవసాయ ఉత్పత్తులు క్రయవిక్రయాలు జరిపారు. మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో అర్ధరాత్రి వ్యాపారాలను అడ్డుకుని కూరగాయాల మార్కెట్ లోపలకు తరలించారు. ఇక నుంచి రోడ్లపై సరుకులు ఉంచి వ్యాపారాలు చేయరాదని శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్ హెచ్చరించారు. వ్యాపారుల సౌకర్యార్థం శాంతినగర్‌లోని వైఎస్సార్ విగ్రహం సంతమార్కెట్ వద్ద సరుకులు ఉంచుకొని క్రయవిక్రయాలు చేసుకోవాలని సూచించారు.

పెన్నహోబిలంలో రథసప్తమి పోస్టర్ల విడుదల



రథసప్తమి పోస్టర్లను విడుదల చేస్తున్న ఈఓ, ప్రధాన అర్చకులు, తదితరులు

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో ఫిబ్రవరి 4న జరిగే రథసప్తమి వేడుకల పోస్టర్లను శనివారం విడుదల చేశారు. ఈఓ సాకే రమేష్‌బాబు, ప్రధాన అర్చకుడు ద్వారకానాథాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈఓ మాట్లాడుతూ రథసప్తమి పర్వదినం రోజున శ్రీవారు గోవాహనం, సూర్యప్రభ, హనుమత, గరుడ వాహనాల్లో భక్తులకు దర్శనమిస్తారన్నారు. అనంతరం భూదేవి, శ్రీదేవి సమేత లక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవం జరుగుతుందన్నారు.

బకాయి బండ .. అభివృద్ధి ఎలా?

- నీటి పన్ను వసూళ్లలో అధికారుల నిర్లక్ష్యం
- మందకొడిగా ఆస్తి పన్ను వసూలు
- రూ.కోట్లలో పేరుకుపోతున్న బకాయిలు
- పైసా విదల్చని కూటమి సర్కారు



రాయదుర్గం మున్సిపల్ కార్యాలయం



రాయదుర్గం: రాయదుర్గం పురపాలికపై బకాయి బండ పడింది. ఆస్తి, నీటి పన్ను వసూళ్లు కాకపోవడంతో అభివృద్ధికి ఆటంకం కలుగుతోంది. ప్రజల నుంచి రావాల్సిన బకాయి రూ.కోట్లలో పేరుకుపోతోంది. వసూళ్లపై మున్సిపల్‌శాఖ అవగాహన కల్పిస్తున్నా వసూలు కావడంలేదు. కూటమి అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు కావస్తున్నా పురపాలక శాఖ ఖజానా ఖాళీగానే ఉంది. మున్సిపాలిటీ అభివృద్ధికి పైసా విదల్చలేదు. పట్టణంలో ఎక్కడి పనులు అక్కడే అన్నట్లు ఆగిపోయాయి. ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు.

రాయదుర్గం పట్టణ జనాభా 75 వేలు. 32 వార్డులకు 18 వార్డు సచివాలయాలు ఏర్పాటయ్యాయి. వీటి పరిధిలోని 2024–25 వ ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను డిమాండ్ మొత్తం రూ.5.23 కోట్లు కాగా, ఇప్పటి వరకు రూ.2.69 కోట్లు మాత్రమే వసూలైంది. మార్చి ఆఖరు నాటికి రూ.2.53 కోట్లు వసూలు కావాల్సి ఉంది. అలాగే మొత్తం నీటి పన్ను రూ.3.78 కోట్లు. ఇప్పటి వరకు కేవలం రూ.0.91 లక్షలు మాత్రమే వసూలైంది. రూ.2.87 కోట్లు భారీ మొత్తం జనం వద్దే పేరుకుపోయింది. నీటి సరఫరా జరిపే పంపులు, ఇతర మోటార్లకు మాత్రమే నెలకు రూ.45 లక్షలు విద్యుత్ బకాయి చెల్లించాల్సి వస్తోంది. ఈ భారం మోయలేక మున్సిపల్‌శాఖ ఇబ్బందులు ఎదుర్కొంటోంది. అరకొరగా చేతికందే జనరల్ ఫండే దిక్కయింది.

రాయదుర్గం మున్సిపాలిటీ పరిధిలో వసూలు కావాల్సిన పన్ను ఇలా..

పట్టణ జనాభా	75 వేలు
వార్డులు	32
సచివాలయాలు	18
ఆస్తి పన్ను డిమాండ్	రూ.5.23 కోట్లు
ఇప్పటి వరకు వసూలైంది	రూ.2.69 కోట్లు
వసూలు చేయాల్సిన మొత్తం	రూ.2.53 కోట్లు
మొత్తం నీటి పన్ను	రూ.3.78 కోట్లు
వసూలైంది	రూ.0.91 లక్షలు
ప్రతి నెలా నీటి పన్ను విభాగంలో చెల్లించే విద్యుత్ చార్జీలు	రూ.45 లక్షలు

రెండు నెలల్లో సాధ్యమేనా?

ఆస్తి పన్ను బకాయి ఎక్కువగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి రావాల్సి ఉంది. సుమారు రూ.కోట్లలోనే ఉంది. 16,448 గృహాల్లో సగానికి పైగా పన్ను చెల్లించేందుకు ముందుకు రావడం లేదు. దీంతో రూ.2.53 కోట్లు పేరుకుపోయిన బకాయిల వసూళ్లకు అధికారులు నానా తంటాలు పడాల్సి వస్తోంది. నీటి పన్ను బకాయిల వసూళ్లు పెద్ద మొత్తంలో నిలిచిపోయాయి. లక్ష్యం రూ.3.78 కోట్లయితే కేవలం రూ.0.91 లక్షలు మాత్రమే వసూలు కావడం గమనార్హం. రూ.2.87 కోట్లు జనం మీదే ఉండిపోయింది. ఆస్తి, నీటి పన్ను కలిపితే రూ.5.4 కోట్లు పన్ను రూపంలో ఆదాయం సమకూరాల్సి ఉంది. ఈ 60 రోజుల్లోనే ఈ మొత్తం వసూలు చేయడం సాధ్యమేనా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌ను సైతం సద్వినియోగం చేసుకోవడం లేదు.

అటకెక్కిన రాయదుర్గం అభివృద్ధి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు కావస్తున్నా పురపాలక శాఖ ఖజానా ఖాళీగానే ఉంది. తాగునీరు, రోడ్లు, వీధి దీపాలు, పారిశుధ్యం..ఇలా దేనికీ పైసా నిధులు విదల్చకపోవడంతో పట్టణ అభివృద్ధి అటకెక్కింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా ప్రతి సచివాలయం పరిధిలో రూ.20 లక్షలు చొప్పున రూ.3.60 కోట్లు అందుబాటులోకి తెచ్చారు. ఇందులో చాలా పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదు. వివిధ అభివృద్ధి పనులు, నవరత్న పథకాల కోసం డీబీటీ ద్వారా రూ.225.28 కోట్లు, నాన్‌డీబీటీ ద్వారా రూ.144.34 కోట్లు లబ్ధి చేకూర్చేలా అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషి చేశారు. ప్రస్తుత కూటమి సర్కార్ ఆ దిశగా ఆదుకునేలా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



ప్రజలు సహకరించాలి

ఆస్తి, నీటి పన్ను వసూళ్లకు ప్రజలంతా సహకరించాలి. వచ్చే మార్చిలోపు అందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చెల్లించాలి. బకాయి పేరుకుపోతే అభివృద్ధి కుంటుపడుతుంది. పన్ను వసూళ్లపై లౌడ్ స్పీకర్లు ఏర్పాటుచేసి అవగాహన కల్పిస్తున్నాం. నీటి పన్ను భారీ మొత్తంలో వసూలు కావాల్సి ఉంది. మరో రెండు నెలల్లోపు వసూళ్ల ప్రక్రియ తప్పక పూర్తయ్యేలా కృషి చేస్తాం.

– దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం



పన్ను చెల్లించాలి

ప్రజలంతా పెండింగ్ లేకుండా పన్ను చెల్లించేందుకు ముందుకు రావాలి. బకాయి పేరుకుపోతే అదనపు భారం మోయాల్సి వస్తుంది. వసూళ్లలో రాయదుర్గం ఎప్పుడూ టాప్ జాబితాలో ఉండేది. ఆ పేరు అలాగే నిలిచేలా అందరూ కృషి చేయాలి. మున్సిపాల్టీకి నిధులు రాకపోవడంతో చాలా పనులు పెండింగ్‌లో ఉన్నాయి. జనరల్ ఫండ్‌తోనే సర్దుబాటు చేయాల్సి వస్తోంది.

– పొరాళ్ల శిల్ప, మున్సిపల్ చైర్‌పర్సన్, రాయదుర్గం

నేడు గణతంత్ర దినోత్సవం

కళ్యాణదుర్గం రూరల్: వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం గణతంత్ర దినోత్సవం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎంపీ తలారి రంగయ్య తెలిపారు. ఆదివారం జెండా ఎగురవేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

లింగ వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం



లింగ వివక్షపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

బొమ్మనహాళ్: లింగ వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమిద్దామని శ్రీధరఘట్ట పీహెచ్‌సీ వైద్యాధికారులు గీతాభార్గవి, కుమారరాజా తెలిపారు. శనివారం మండలంలోని శ్రీధరఘట్ట హైస్కూల్‌లో లింగ వివక్షతపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ ఆడపిల్లలు చదువుకోవడం వల్ల ఆర్థిక స్వావలంబన సాధించి, ఉజ్వల భవిష్యత్ సాకారమవుతుందన్నారు. ప్రతి బాలిక 18 ఏళ్ల నిండిన తర్వాతే వివాహం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, సూపర్‌వైజర్ ఉమాదేవి, ప్రధానోపాధ్యాయుడు సతీష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులు అరికట్టండి

కుందుర్పి: గ్రామాల్లో బెల్టుషాపులను అరికట్టాలని ఎంపీపీ కమలమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు రాధాస్వామి వైస్ ఎంపీపీలు భీమిరెడ్డి, మాజీ వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ పాలాక్షి కంబదూరు ఎక్సైజ్‌శాఖ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ కుందుర్పి మద్యం దుకాణం నుంచి బహిరంగంగా వాహనాల ద్వారా గ్రామాలకు మద్యం సరఫరా అవుతోందన్నారు. దీనికి తోడు కర్ణాటక మద్యం విక్రయించరాదని మద్యం దుకాణ యజమానులకు చెందిన ప్రైవేట్ వ్యక్తులు గ్రామాల్లో దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని కెంచంపల్లి, తూముకుంట, ఎర్రగుంట, వడ్డేపాళ్యం గ్రామాల ప్రజలు చెప్తున్నారు.

అటవీ భూముల పరిశీలన

కుందుర్పి: మండలంలోని జంబుగుంపల, కర్ణాటక అడవులను ఆనుకొని ఉన్న అటవీ భూములను జంబుగుంపల అటవీ బీట్ అధికారి పరమేశ్వరప్ప, సిబ్బంది శనివారం పరిశీలించారు. జంబుగుంపల అటవీ ప్రాంతం 7 వేల ఎకరాల్లో విస్తరించి ఉంది. కాగా జంబుగుంపల అడవి కర్ణాటక రాష్ట్రం పావగడ అడవికి ఆనుకొని ఉండడంతో కొందరు అక్రమార్కులు అటవీ భూములను ఆక్రమించి, పంటలు సాగు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందడంతో పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. కాగా మారెమ్మ కొండ ప్రాంతంలో సుమారు 10 ఎకరాలు అటవీభూములను కొందరు ఆక్రమించుకున్నా, స్వాధీనం చేసుకోవడంలో అధికారులు వెనుకంజ వేస్తున్నట్లు స్థానికులు తెలిపారు.

నారాయణ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి



రాయదుర్గం వినాయక సర్కిల్‌లో రాస్తారోకో చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

రాయదుర్గంటౌన్: విద్యార్థి చావుకు కారణమైన నారాయణ కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని వినాయక సర్కిల్‌లో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో జరిగింది. ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగిశివ, ఎన్ఎస్‌యూఐ జిల్లా నాయకులు అనిల్ మాట్లాడారు. అనంతపురంలోని నారాయణ కళాశాలలో ఫీజు ఒత్తిడితో విద్యార్థి చరణ్ మూడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. ఇది ముమ్మాటికీ నారాయణ కళాశాల యాజమాన్యానిదే బాధ్యత అన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. నారాయణ విద్యా సంస్థలకు ఒత్తాసు పలుకుతున్న ఆర్ఐఓను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

సరిహద్దు పాఠశాలల అభివృద్ధికి కృషి



కార్యక్రమంలో పాల్గొన్న అధ్యక్షుడు సోమన్న, ఉపాధ్యాయులు

డి హీరేహాళ్(రాయదుర్గం): కర్ణాటక సరిహద్దులో (గడి బోర్డర్ ఏరియా) ఉండే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని గడి బోర్డర్ అధ్యక్షుడు సోమన్న పేర్కొన్నారు. డి హీరేహాళ్ మండలంలోని నింగమ్మనహళ్లిలో ఉండే ఎంపీపీ కర్ణాటక స్కూల్‌ను వారు శనివారం సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో విడివిడిగా సమావేశం నిర్వహించారు. అనంతరం స్మార్ట్ టీవీ, యూపీఎస్, బ్యాటరీని వితరణ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడారు. తమిళనాడు, గోవా, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని సరిహద్దు ప్రాంతాల్లో బోధించే కన్నడ పాఠశాలల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలరాజ్, తదితరులు పాల్గొన్నారు.

హెచ్చెల్సీలో మహిళను కాపాడిన ఇద్దరికి సన్మానం



మహిళను కాపాడిన యువకులను సత్కరిస్తున్న పోలీసులు

ఉరవకొండ: హెచ్చెల్సీ కాలువలో ప్రమాదవశాత్తూ పడి కొట్టుకుపోతున్న మహిళను కాపాడిన సాహస యువకులను ఉరవకొండ పోలీసులు శనివారం సన్మానించారు. వివరాలు.. మూడు రోజుల క్రితం రాయంపల్లికి చెందిన సునీతమ్మ దుస్తులు ఉతికేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ నీటిలో పడి కొట్టుకుపోతుంటే..అటుగా వెళ్తున్న ద్విచక్రవాహనదారులు బెళుగుప్పకు చెందిన లింగప్ప, ఎర్రిస్వామి ప్రాణాలకు తెగించి మహిళను కాపాడారు. వీరి సాహసాలను గుర్తించిన రూరల్ సీఐ సయ్యద్ చిన్నగౌస్, అర్బన్ సీఐ మహానంది, ఎస్ఐ జనార్దన్‌నాయుడు ఘనంగా సత్కరించారు. కాలువలో దూకిన సమయంలో ఎర్రిస్వామి అనే యువకుడి ఫోన్ కూడా కాలువలో పడిపోవడంతో పోలీసులు కొత్త ఫోన్‌ను ఎర్రిస్వామికి అందించారు.

సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీడీఓ లక్ష్మీనారాయణ

బెళుగుప్ప: మండలంలోని వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని సభ్యులు తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, తహసీల్దార్ షర్మిళ ఆధ్వర్యంలో ఎంపీపీ పెద్దన్న అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలమీట్ జరుగుతున్నట్లు సమాచారం ఇవ్వలేదని పలువురు సభ్యులు ప్రశ్నించారు. సమావేశంలో పలు పంచాయతీల్లో రానున్న వేసవికి ముందస్తు ప్రణాళికతో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చూడాలన్నారు. ప్రధాన రహదారుల నుంచి గ్రామాలకు లింకురోడ్లు నిర్మించాలని సభ్యులు కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పుష్పావతి, ఎంఈఓలు మల్లారెడ్డి, ఈఓఆర్డీ నాగేశ్వరశాస్త్రి, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

28న పురపాలక సంఘ సమావేశం

రాయదుర్గంటౌన్: రాయదుర్గం మున్సిపల్ కౌన్సిల్ మీట్ ఈనెల 28న ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప తెలిపారు. సమావేశంలో పట్టణంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజా సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు, విభాగాల వారిగా అధికారులు హాజరుకావాలని కోరారు.

ఎలుగుబంటి సంచారంతో భయాందోళన

రాయదుర్గంటౌన్: పట్టణంలోని జాతీయ రహదారి గుమ్మఘట్ట రోడ్డు పెట్రోల్ బంక్ వద్ద సర్వీస్ రోడ్డుపై ఎలుగువంటి సంచారంతో భయాందోళనలు నెలకొన్నాయి. శుక్రవారం రాత్రి స్థానికులు బ్రిడ్జి పక్కన సర్వీస్ రోడ్డులో ఎలుగువంటి సంచారాన్ని గుర్తించారు. కుక్కలు వెంటపడడంతో సమీపంలోని కొండపైకి వెళ్లింది. ఇటీవల కురాకులగుట్ట వద్ద కూడా ఎలుగుబంటి కనిపించడంతో కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు.

1,510 పశువులకు నట్టల నివారణ టీకా

గుమ్మఘట్ట: తాళ్లకెర,భూపసముద్రం గ్రామాల్లో పశువులు, జీవాలకు టీకా వేసినట్లు పశువైద్యులు నవీన్‌కుమార్ తెలిపారు. పశు ఆరోగ్య శిబిరాల ద్వారా 1,510 పశువులకు నట్టల నివారణ టీకాలు, గాలికుంటు వ్యాధి టీకా, 80 పశువులకు గర్భకోశ పరీక్షలు చేసినట్లు తెలిపారు.సిబ్బంది దివ్యభారతి, భవ్య, వీరేష్ కిష్టప్ప, ఆసిఫ్, రమేష్, రవి, హరిబాబు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

బొమ్మనహాళ్: కురువల్లి గ్రామ పొలాల్లోని కంపచెట్లలో పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ నబీరసూల్ తన సిబ్బందితో దాడులు చేశారు. పేకాటరాయుళ్ల నుంచి రూ.7,100 నగదు స్వాధీనం చేసుకున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కంబదూరు: కంబదూరు ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలోని కెట్టూరు మండలం కంబాలపల్లికి చెందిన శంకర్‌ను శనివారం అదుపులోకి తీసుకున్నారు. 35 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సునీల్‌కుమార్,ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

పశుఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

కూడేరు: ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ రంగారెడ్డి సూచించారు. శనివారం కమ్మూరు, కరుట్లపల్లిలో ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. కమ్మూరులో సర్పంచ్ రంగారెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పశువులకు వైద్యాధికారులు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎల్ఎస్ఏ భాగ్యలక్ష్మీ, ఏహెచ్ఏలు రామాంజనేయులు, రఘువర్ధన్, దామోదర్, భవాని, యశోద పాల్గొన్నారు. కరుట్లపల్లి కార్యక్రమంలో పశువైద్యాధికారిణి శ్వేత, ఏహెచ్ఏలు ఎర్రిస్వామి, సుబ్బరాయుడు, సర్దార్ బాషా, రాఘవ పాల్గొన్నారు.

ప్రాథమిక గొర్రెల సహకార సంఘాల ఎన్నికలు

కళ్యాణదుర్గం రూరల్: మండల పరిధిలోని పలు పంచాయతీల్లో ప్రాథమిక గొర్రెల సహకార సంఘాల ఎన్నికలను పశువైద్యులు శనివారం నిర్వహించారు. తిమ్మసముద్రం గ్రామానికి ప్రెసిడెంట్‌గా సత్యనారాయణరెడ్డిని, ఇట్లంపల్లి, గ్రామానికి లోకేష్, కాపర్లపల్లి గ్రామానికి గంగప్పను ఎన్నుకున్నారు. వీటితో పాటు ప్రతి పంచాయతీకి ఐదుగురు మెంబర్లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పశువైద్యులు సూర్యనారాయణరెడ్డి, మంజునాథ్, సమతారెడ్డి, నవీన్, రమేష్, రైతులు, గొర్రెల కాపర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఏకాదశి పూజలు

బొమ్మనహాళ్: ఉంతకల్లు రుక్మిణీ పాండురంగస్వామికి ఏకాదశి పూజలు వైభవంగా జరిగాయి. శనివారం తెల్లవారుజామున ప్రత్యేక జలంతో స్వామికి వేదమంత్రోచ్చరణల మధ్య అభిషేకం చేశారు. అనంతరం స్వామికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ మహామంగళహారతి పూజలు చేశారు.

పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటాం



లీగల్ సెల్ అధ్యక్షుడు రామాంజనేయులు

కళ్యాణదుర్గం రూరల్: నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడిగా తిమ్మగానిపల్లి రామాంజనేయులు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తనపై ఉన్న నమ్మకంతో నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడిగా నియమించారన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్యకు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఓటు హక్కు వజ్రాయుధం



బ్రహ్మసముద్రంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు



రాయదుర్గంలో ఓటు హక్కు ప్రాధాన్యతపై ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ కమిషనర్, సిబ్బంది

రాయదుర్గంటౌన్: అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, తహసీల్దార్ నాగరాజు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయంతోపాటు పోలింగ్ బూత్‌లలో ఓటు హక్కు ప్రాధాన్యతపై ప్రతిజ్ఞ చేశారు.

బ్రహ్మసముద్రం : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం అని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సుమతి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ లో తహసీల్దార్ సుమతి ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనాథ్‌రెడ్డి, ఆర్ఐ నాగిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. అధికారులు, ప్రజలతో కలసి ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రమాదేవి, వీఆర్ఓలు రమేష్, ఎర్రిస్వామి, ఎర్రిస్వామి, మధు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: యువత అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మహాత్మాజ్యోతిరావ్‌పూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ఎంజేపీ పాఠశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటరు దినోత్సవం

కళ్యాణదుర్గం రూరల్: ప్రభుత్వ ఎస్వీజీఎం డిగ్రీ కళాశాలలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ జయరామిరెడ్డి మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి భారతీయుడూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శేషయ్య, ఎన్ఎస్ఎస్ అధికారులు కె.శ్రీధర్, రవికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం

కంబదూరు: ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని తహసీల్దార్ బాలకిషన్ అన్నారు. మండలంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రతిజ్ఞ చేసి ఓటు ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనరసింహ, వీఆర్వోలు సంజీవ్‌కుమార్, నిరంజన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పౌరుడూ ఓటు హక్కు కలిగి ఉండాలి

ఉరవకొండ: ప్రతి పౌరుడూ ఓటు హక్కు కలిగి ఉండాలని తహసీల్దార్ మహబూబ్‌బాషా తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. కళాశాలలోని ఎన్ఎస్ఎస్, రాజనీతి విభాగం ఆధ్వర్యంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మస్తానప్ప అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు వెంకటరాముడు, పరమేష్, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు సిరాజ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

కూడేరు: ఓటు రాజ్యాంగం మనకిచ్చిన హక్కు అని డిప్యూటీ తహసీల్దార్ సూర్యప్రతాప్ అన్నారు. శనివారం కూడేరులోని హైస్కూల్‌లో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీదేవి, వీఆర్వో రమేష్, బీఎల్ఓలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశం

బ్రహ్మసముద్రం : మండలం కేంద్రం సమీపంలోని రైతు సంఘం మాజీ అధ్యక్షుడు గోపాల్ రెడ్డి వ్యవసాయ తోటలో ఆదివారం ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఓ ప్రకటనలో తెలియజేశారు. మండలంలోని వైఎస్ఆర్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.